సాక్షి నిజామాబాద్

మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



ఆకట్టుకున్న స్టాల్స్..

రైతు మహోత్సవంలో వ్యవసాయ, అనుబంధ శాఖల విభాగాలు, రైతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి.

- 8లో ▸



30 కిలోల గంజాయి..

ఎండుగంజాయి తరలిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
43.4 /24.9

వాతావరణం

ఉదయం నుంచి ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎకో టూరిజంపై చిగురించిన ఆశలు

- నేడు జిల్లాకు రానున్న ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్‌రెడ్డి
- ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ నిలిచే ప్రాంతాలపై చర్చించే అవకాశం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే నందిపేట్ మండల పరిధితోపాటు బాల్కొండ మండలం జలాల్‌పూర్‌లో ఎకో టూరిజం ఏర్పాటుపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్‌రెడ్డి నేడు చర్చించనున్నారు. ఈ మేరకు చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం జిల్లాకు రానున్నారు. ప్రస్తుతం ఎస్సారెస్పీలో నీటి నిల్వ భారీగా తగ్గడంతో బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతాలను సందర్శించేందుకు అనువుగా ఉంటుంది. ఎకో టూరిజానికి సంబంధించి గత కొంత కాలంగా ప్రతిపాదనలు చేస్తుండగా, పలుమార్లు ఫారెస్ట్, ఇరిగేషన్ అధికారులు సర్వే చేపట్టారు. ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్‌రెడ్డి జిల్లాకు రానున్న నేపథ్యంలో ఎకో టూరిజంపై ఆశలు చిగురించాయి.

జడ్జీలకు వేసవిలో బదిలీలు



ఖలీల్‌వాడి: వేసవిలో న్యాయమూర్తులకు బదిలీలు ఉంటాయని ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కనకదుర్గ తెలిపారు. నిజామాబాద్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్‌బాబు హైదరాబాద్‌కు బదిలీ అయిన నేపథ్యంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాయమూర్తులకు బదిలీలు తప్పవని ఎక్కడికి వెళ్లినా వృత్తి ధర్మాన్ని మరిచిపోవద్దన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జడ్జి శ్రీకాంత్‌బాబు కోర్టు విధుల్లో అందరిని కలుపుకుని వెళ్లేవారన్నారు. బార్ అధ్యక్షుడు మామిల్ల సాయారెడ్డి, ప్రధాన కార్యదర్శి మాణిక్ రాజు ఆధ్వర్యంలో జడ్జి శ్రీకాంత్‌బాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు దిలీప్, సంయుక్త కార్యదర్శి ఝాన్సీరాణి, కోశాధికారి నారాయణ దాసు, లైబ్రరీ కార్యదర్శి శ్రీమాన్, కార్యవర్గ సభ్యులు ఆరేటి నారాయణ, సుజిత్, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: సబ్జెక్టు రిసోర్స్ పర్సన్స్ నియామకాలు చేపట్టనున్న నేపథ్యంలో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. మండల, జిల్లా రిసోర్స్ పర్సన్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల రిసోర్స్ పోస్టులకు ఎంఈవో కార్యాలయాల్లో, జిల్లా రిసోర్స్ పర్సన్స్ పోస్టుకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుందని సూచించారు. ఎంపిక ప్రక్రియ కలెక్టర్ ఆధ్వర్యంలో కొనసాగుతుందని తెలిపారు.



వేదికపై మంత్రులు తుమ్మల, ఉత్తమ్, జూపల్లి, సలహాదారులు పోచారం, షబ్బీర్ అలీ, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ఎమ్మెల్సీఅంజిరెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి, పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు, కలెక్టర్లు హన్మంతు, సంగ్వాన్

రైతు ప్రయోజనాలే పరమావధి

ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

జిల్లాలో కాళేశ్వరం 20, 21, 22 ప్యాకేజీల పెండింగ్ పనులతోపాటు గుత్ప ఎత్తిపోతల పథకం మిగులు పనులకు అవసరమైన నిధులు కేటాయించి త్వరలో పూర్తి చేయిస్తామని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల పూడికతీతకు ఈనెలాఖరులోగా టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. భూగర్భ జలాలు వృద్ధి చెందేలా అవసరమైన చోట విరివిగా చెక్ డ్యామ్‌లు నిర్మిస్తామని అన్నారు.



- సాగుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాలి
- ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపాలి
- రైతులకిచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- అట్టహాసంగా ప్రారంభమైన రైతు మహోత్సవం
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన స్టాళ్లు
- ఐదు జిల్లాల నుంచి తరలివచ్చిన రైతులు



సుభాష్‌నగర్: రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలే పరమావధి అని, ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతాంగానికి ఇచ్చిన ప్రతి హామీ అమలు కోసం పని చేస్తామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రైతు మహోత్సవం కార్యక్రమం సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతు మహోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

అనంతరం ఏర్పాటుచేసిన సభలో తుమ్మల మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం చేయాలని, సాగుకు ఆధునిక సాంకేతికతను జోడించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించేలా మెళకువలు అందించేందుకు రైతుమహోత్సవం ఎంతగానో ఉపకరిస్తుందని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర దేశాల్లో సాగు చేసే పంటలు, ఆధునిక సాగుపై మూడురోజులపాటు శాస్త్రవేత్తలు, నిపుణులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. అత్యంత లాభదాయకమైన పంట పామాయిల్ అని, జంతువులు, చీడ పురుగులు నష్టం చేయవని, రైతులు సాగు చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న జిల్లాలో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి తుమ్మల తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్ ఇరిగేషన్‌లో జిల్లాకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులుగా ఎంపిక చేసిన రైతులకు సబ్సిడీతో కూడిన ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు, చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, కార్పొరేషన్ చైర్మన్‌లు ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి, తాహెర్ బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్, జంగా రాఘవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, అరికెల నర్సారెడ్డి, నగేశ్‌రెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్, మునిపల్లి సాయిరెడ్డి, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, సీపీ సాయిచైతన్య, పసుపు బోర్డు కార్యదర్శి భవానీ శ్రీ, వ్యవసాయశాఖ డైరెక్టర్‌ఎన్ గోపి, ఉద్యానవనశాఖ కమిషనర్ యాస్మిన్ బాషా, మార్కెటింగ్‌శాఖ జేడీ మల్లేశం, డీడీ పద్మహర్ష, అనుబంధశాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, ఐదు జిల్లాల నుంచి రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



రైతాంగానికి తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో వెన్నుదన్నుగా నిలుస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉందన్నారు. బోనస్, రుణమాఫీ, రైతు భరోసా, ఇతర పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

వేదికపై వాగ్వాదం

రైతు మహోత్సవం ప్రారంభ సభావేదికపైనే జిల్లా ఎమ్మెల్యేల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ప్రసంగిస్తూ గన్నీ బ్యాగుల కొరత ఉందని మంత్రుల దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. ఆ తర్వాత మాట్లాడిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి.. రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి సమస్యలు లేవని, బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే గన్నీ బ్యాగుల కొరత ఉందని చెబుతున్నారని అన్నారు. భూపతిరెడ్డి ప్రసంగం ముగిసిన తర్వాత రాకేశ్‌రెడ్డి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు వద్దకు వెళ్లి తనపై చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఇరువురు మంత్రులు రాకేశ్‌రెడ్డిని సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది.



రాకేశ్‌రెడ్డిని సముదాయిస్తున్న మంత్రులు

రైతులు తలెత్తుకుని తిరిగే రోజు రావాలి



రాష్ట్రంలోని ప్రతి రైతు తలెత్తుకుని తిరిగే రోజు రావాలని, పంట పండించే రైతుకు బోనస్ ఇవ్వడంతో ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సేంద్రియ ఎరువులను ప్రోత్సహించాలని, పెట్టుబడి ఖర్చు తగ్గించాలని, అధిక దిగుబడులు పెరగాలన్నారు. రైతులు అప్పుల నుంచి బయట పడేలా అధికారులు, ప్రభుత్వం పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. పంటలకు బోనస్ ఇస్తే, రైతు భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.



స్టాల్‌ను ప్రారంభిస్తున్న షబ్బీర్, పక్కన మంత్రులు తుమ్మల, ఉత్తమ్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారు పోచారం



రైతు మహోత్సవంలో పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన రైతులు, నాయకులు

ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్



ఏసీబీకి పట్టుబడిన పంచాయతీరాజ్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ శర్మ

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలోని పంచాయతీ రాజ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఎస్ శ్రీనివాస్ శర్మ రూ.7 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. డొంకేశ్వర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు సంబంధించిన రూ.4 లక్షల 75 వేల బిల్లుల మంజూరు చేసేందుకు రూ.7,500 ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను శ్రీనివాస్ డిమాండ్ చేసాడు. దీంతో కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా ప్రణాళిక ప్రకారం సోమవారం కాంట్రాక్టర్ రూ.7 వేలు ఇవ్వగా తీసుకుంటున్న శ్రీనివాస్ శర్మను పట్టుకున్నట్లు డీఎస్పీ శేఖర్‌గౌడ్ వివరించారు. విచారణ పూర్తయిన అనంతరం నిందితుడిని హైదరాబాద్ నాంపల్లి కోర్టుకు తరలిస్తామని డీఎస్పీ వివరించారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు నగేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రకృతి రైతులు

- సుభాష్ పాలేకర్ విధానంతో ప్రతి ఒక్కరికీ ఆదర్శం
- 2015 నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న కరుటూరి పాపారావు
- గత 17 ఏళ్లుగా మహబూబాబాద్ జిల్లాకు చెందిన రైతు దామోదర్‌రెడ్డి..



తన స్టాల్ వద్ద కరుటూరి పాపారావు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ప్రారంభమైన రైతు మహోత్సవంలో వివిధ జిల్లాలకు చెందిన రైతులు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సుభాష్ పాలేకర్ విధానంలో పూర్తిగా ప్రకృతి విధానంలో వ్యవసాయం చేస్తున్న నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జైతాపూర్‌కు చెందిన రైతు కరుటూరి పాపారావు, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన రైతు గంట దామోదర్‌రెడ్డిలు ఏర్పాటు చేసిన స్టాల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి.

2015 నుంచి..

కరుటూరి పాపారావు 8 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో వరి పంటను సాగు చేస్తున్నారు. మరో అర ఎకరంలో అన్నిరకాల పసుపు, పండ్ల మొక్కలు, కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. 2012లో బాసరలో సుభాష్ పాలేకర్ ఆలోచనల నుంచి స్ఫూర్తి పొంది 2015 నుంచి ఈ సేంద్రియ సాగు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలోని ఇతర రైతులను కలుపుకుని 'నేచురల్ ప్రొడక్ట్స్ కన్స్యూమర్స్ గ్రూపు' అనే వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకుని నాణ్యమైన సేంద్రియ ఉత్పత్తులను అవసరమైనవారికి సరఫరా చేస్తున్నారు.



స్టాల్‌లో గంట దామోదర్‌రెడ్డి

బీఎస్సీ అగ్రికల్చర్ చదివి..

రైతు గంట దామోదర్‌రెడ్డి 1974లో బీఎస్సీ (అగ్రికల్చర్) చేశారు. 17 ఏళ్లుగా సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో 11 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ప్రస్తుతం దామోదర్‌రెడ్డి 22 రకాల పసుపు పంట పండిస్తున్నారు. పసుపుతో క్యాన్సర్‌కు ఔషధం ఇస్తున్నట్లు దామోదర్‌రెడ్డి తెలిపారు.

భానుడి భగభగ

- 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



నిజామాబాద్ అర్బన్: జిల్లాలో సోమవారం ఎండ తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. గత కొద్ది రోజులుగా ఎండలు మండుతున్నాయి. సోమవారం 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాది ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదుకాగా, నిజామాబాద్ జిల్లా రెండో స్థానంలో ఉంది. గత శనివారం 42.6 డిగ్రీలు, ఆదివారం 42.3 ఉష్ణోగ్రత నమోదైంది. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతోందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

బంగారం ధగధగ

- రూ.లక్షకు చేరువలో ధర



నిజామాబాద్ రూరల్: బంగారం ధర పరుగులు తీస్తోంది. సోమవారం నాడు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.99 వేలకు చేరగా జీఎస్టీ కలుపుకుని రూ.లక్షకు పైగా పలకడం గమనార్హం. శుభకార్యాల సీజన్‌లో తులం బంగారం ధర రూ.లక్షకు చేరువకావడంతో సామాన్య ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. షోరూమ్‌లో 24 క్యారెట్ల బంగారం (99.9 శాతం)ధర రూ.98,780 పలకగా దీనికి 6 శాతం జీఎస్టీ కలుపుకుని ధర రూ.1,04,700కు చేరింది. 22 క్యారెట్ల(916) బంగారం ధర రూ.90,550 పలకగా నగను బట్టి షోరూమ్‌ల నిర్వాహకులు జీఎస్టీని విధించారు.

సాధారణ ముస్లింల కోసమే వక్ఫ్ చట్ట సవరణ



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి, పక్కన ఎమ్మెల్యే ధన్‌పాల్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్

- బోర్డు దేశానికే ప్రమాదకరంగా మారింది
- ఓవైసీ సహా కాంగ్రెస్ ముస్లిం నేతలు వక్ఫ్ ఆస్తులను దోచుకున్నారు
- ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: దేశంలోని సాధారణ ముస్లింల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించిందని ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు దేశంలోనే మూడో అతిపెద్ద భూమి కలిగిన సంస్థ అని, 2006లో 6లక్షల ఎకరాలు ఉండగా, 2025 నాటికి 38లక్షల ఎకరాలకు పెరిగిందని తెలిపారు. కానీ దాని ద్వారా వచ్చే ఆదాయం మాత్రం కేవలం రూ.9.90లక్షలు మాత్రమేనని అన్నారు. చట్టంలోని లొసుగులను అవకాశంగా మల్చుకుని ఓవైసీ సహా కాంగ్రెస్ ముస్లిం నేతలు వక్ఫ్ ఆస్తులను దోచుకుంటున్నారని విమర్శించారు. 1995లో పీవీ నర్సింహారావు వక్ఫ్‌బోర్డుకు జ్యుడిషియల్ అధికారాలు కట్టబెట్టగా, 2013లో సోనియా గాంధీ వక్ఫ్ ట్రిబ్యునల్‌కు అవకాశమిచ్చిందన్నారు. సుప్రీంకోర్టు కంటే ఎక్కువ అధికారాలను వక్ఫ్ ట్రిబ్యునల్‌కు కల్పించారని ఆరోపించారు. వక్ఫ్ కింద ధరణి, భూభారతి వంటి సైట్లు ఏమీ పని చేయవని, వక్ఫ్‌తో ఇతర మతాలకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. వక్ఫ్‌బోర్డు దుర్వినియోగమైందని, దేశానికి ప్రమాదకరంగా మారిన చట్టాన్ని కేంద్రం సవరించిందన్నారు. ప్రభుత్వ భూములు వక్ఫ్ భూమిగా ఎలా మారుతుందని, వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పు ఎలా ఫైనల్ అవుతుందని ప్రశ్నించారు. ట్రిబ్యునల్‌లో అందరూ సున్నీ ముస్లిములే ఉంటారని, అలాంటప్పుడు ఇతర మతాలు, ప్రజలు, సంస్థలు, రైతులకు ఎలా న్యాయం జరుగుతుందన్నారు. కేంద్రం చేసిన చట్ట సవరణ ద్వారా ప్రజలు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని, వక్ఫ్ ఆదాయం కూడా పెంచేలా చట్టం చేశామని తెలిపారు. బీజేపీ ప్రజా శ్రేయస్సు కోసం నడిచే పార్టీ అని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి, నాయకులు గోపిడి స్రవంతిరెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పద్మారెడ్డి, నాయుడి రాజన్న, నాగరాజు, పంచరెడ్డి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెయూ డిగ్రీ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 28 నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ రెగ్యులర్‌ 2, 4, 6వ సెమిస్టర్‌, బ్యాక్‌లాగ్‌ 1, 3, 5 వ సెమిస్టర్‌ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి సంపత్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు విడుదల చేయకపోవడం, ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో ప్రయివేట్‌ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు పరీక్షల నిర్వహణకు నిరాకరించడంతో వాయిదా వేసినట్లు సమాచారం.

కాంట్రాక్ట్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్‌ చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): యూనివర్సిటీల్లో రెగ్యులర్‌ ప్రొఫెసర్లతో సమానంగా విద్యాబుద్ధులు నేర్పిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్‌ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్‌ చేయాలని బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకులు, ధర్పల్లి మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌ డిమాండ్‌ చేశారు. రాష్ట్రకమిటీ పిలుపు మేరకు తెయూ క్యాంపస్‌లో నిరసన దీక్షలు చేపట్టిన తెయూ కాంట్రాక్టు అసిస్టెంట్‌ ప్రొఫెసర్లకు సోమవారం బాజిరెడ్డి జగన్‌ సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా జగన్‌ మాట్లాడుతూ.. యూనివర్సిటీల్లో కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న వారికి తగిన న్యాయం చేయకుండా ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీకి మార్గదర్శకాలు జారీచేయడం ఎంతవరకు కరెక్టని ప్రశ్నించారు. వర్సిటీల్లో పని చేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజ్‌ చేయాలన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులకు అండగా బీఆర్‌ఎస్‌ పార్టీ ఉంటుందని హామీ ఇచ్చారు.

మేనేజ్‌మెంట్‌ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



తెయూ(డిచ్‌పల్లి): మేనేజ్‌మెంట్‌ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, మారుతున్న ధోరణులతోపాటు మన సంస్కృతి, సాంప్రదాయాలను కూడా అనుసరించాలని ప్రొఫెసర్‌ సీహెచ్‌ ఆంజనేయులు అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఈవెంట్‌ మేనేజ్‌మెంట్‌ కార్యక్రమంలో భాగంగా 'ట్రెడిషనల్‌ ట్రెండ్స్‌' అనే అంశంపై సాంప్రదాయ దుస్తుల పోటీలను నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అధ్యాపకులు వాణి, రాజేశ్వరి, ఈవెంట్‌ మేనేజర్లుగా వెంకటేష్‌, మౌనిక, నవిత వ్యవహరించారు. పోటీలో స్వరూప (ప్రథమ), ప్రేమ్‌కుమార్‌ (ద్వితీయ), సందీప్‌ (తృతీయ) బహుమతులు అందుకున్నారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికీ ధ్రువపత్రాలను అందజేశారు.

ఎస్సైల బదిలీలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ కమిషనరేట్‌ పరిధిలో పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ మల్టీ జోన్‌-1 ఐజీ చంద్రశేఖర్‌ రెడ్డి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జక్రాన్‌ పల్లి ఎస్సై తిరుపతిని, ఆర్మూర్‌ ఎస్సై-1 మహేష్‌ను, మెండోరా ఎస్సై నారాయణను వీఆర్‌కు అటాచ్‌ చేశారు. సీసీఎస్‌లో పని చేస్తున్న రమేష్‌ను ఆర్మూర్‌ ఎస్సై-1గా నియమించారు. నిర్మల్‌ జిల్లా లక్ష్మణచందా పీఎస్‌ ఎస్సై మాలిక్‌ రెహమాన్‌ను జక్రాన్‌పల్లి ఎస్సైగా బదిలీ చేశారు. రెండో టౌన్‌ ఎస్సై యాసిర్‌ అరాఫత్‌ను మెండోరా ఎస్సైగా నియమించారు. జగిత్యాల్‌ వీఆర్‌లో ఉన్న సయ్యద్‌ ఇమ్రాన్‌ను రెండోటౌన్‌ ఎస్సైగా బదిలీ చేశారు.



కర్కుమిన్‌ పర్సంటేజీ ఎక్కువ ఉన్న పసుపును చూపుతున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి



సబ్సిడీ చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రులు తుమ్మల, ఉత్తమ్‌, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



స్టాల్‌లో వివరాలు తెలుసుకుంటున్న మంత్రులు జూపల్లి, ఉత్తమ్‌, ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌

ఆకట్టుకున్న రైతు మహోత్సవం స్టాల్స్‌

- వ్యవసాయ అనుబంధ శాఖలు, రైతు ఉత్పత్తిదారు సంఘాలు, రైతుల ఆధ్వర్యంలో ఏర్పాటు



రైతు మహోత్సవంలో స్టాళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, కార్పొరేషన్ల చైర్మన్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: నిజామాబాద్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రైతు మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ ఆకట్టుకుంటున్నాయి. వ్యవసాయ, అనుబంధ శాఖల విభాగాలు, పలువురు రైతుల ఆధ్వర్యంలో సుమారు 150 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణతో పాటు ఏపీ నుంచి సైతం పలువురు రైతులు వచ్చి తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

- నందిపేట మండలంలోని చింరాజ్‌పల్లి గ్రామానికి చెందిన 750 మంది రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసుకుని పసుపు, మిర్చి పంటలను మార్కెట్‌ చేసుకుంటున్నారు. వీరు ఏర్పాటు చేసిన స్టాల్‌లో వారి పంట ఉత్పత్తులను ప్రదర్శించారు.
- జక్రాన్‌పల్లి మండలం చింతలూరు గ్రామానికి చెందిన ఆదర్శ రైతు చిన్నికృష్ణుడు 170 దేశీ వరి రకాల సేంద్రియ విత్తనాలను ప్రదర్శనకు ఉంచారు.
- బీర్కూర్‌ మండలంలోని మల్లాపూర్‌కు చెందిన సత్యవతి అనే మహిళా రైతు సుభాష్‌ పాలేకర్‌ విధానంలో 3 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. పసుపు, కంది, అరటి పంటలను ప్రకృతి విధానంలో పండిస్తున్నారు. ఈ మహిళా రైతు స్టాల్‌ ఆకట్టుకుంది.
- ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలకు చెందిన తిరుమల్‌రెడ్డి అనే రైతు 'నల్లమల హనీబీ పార్క్‌' పేరిట తీసుకొచ్చిన నాణ్యమైన తేనె, అదేవిధంగా నిర్మల్‌కు చెందిన శ్రీనివాస్‌ అనే రైతు తీసుకొచ్చిన నాణ్యమైన తేనెపై పలువురు ఆసక్తి చూపారు.
- బ్రహ్మకుమారీస్‌ ఆధ్వర్యంలో టెర్రస్‌ గార్డెన్స్‌ ఏర్పాటు విషయమై ఏర్పాటు చేసిన స్టాల్‌ ఆకట్టుకుంది. ప్రతిఒక్కరూ ఇంటిపైన కూరగాయలు సేంద్రియ విధానంలో సాగు చేసుకుంటే ఆరోగకరమైన సమాజం నెలకొంటుందని సందేశం ఇచ్చేలా ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌కు అనేక మంది వచ్చి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర సహకార యూనియన్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్‌ కేశవేణు ఈ స్టాల్‌ను సందర్శించి సందర్శకులకు టెర్రస్‌ గార్డెన్స్‌ ప్రాధాన్యత గురించి వివరించారు.

ఆదర్శం 'జేఎంకేపీఎం' ఎఫ్‌పీవో

నిజామాబాద్‌ జిల్లా జక్రాన్‌పల్లి మండలంలోని జక్రాన్‌పల్లి, మనోహరాబాద్‌, కలిగోట్‌, పడకల్‌, మైలారం గ్రామాలకు చెందిన 600 మంది రైతులు ఎఫ్‌పీవో ఏర్పాటు చేసుకున్నారు. తమ ఊరి పేరులోని మొదటి ఆంగ్ల అక్షరంతో 'జేఎంకేపీఎం' అనే పేరు పెట్టుకున్నారు. మనోహరాబాద్‌ వద్ద 14 గుంటల భూమిలో ప్రయోగశాల, యంత్రాలతో కూడిన 6వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో గోదాం నిర్మాణం చేసుకున్నారు. ఇందులో పసుపు ఉడకబెట్టే, పాలిష్‌ చేసే, గ్రేడింగ్‌ చేసే, పసుపు పొడర్‌ తయారు చేసే, పసుపు ప్యాకింగ్‌ చేసే, పసుపు ఆకుతో ఆయిల్‌ తీసే యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. వీటితోపాటు కలిగోట్‌, జక్రాన్‌పల్లి గ్రామాల్లో పసుపు ఆకుతో ఆయిల్‌ తీసే మరో రెండు యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. దేశవిదేశాల్లోని వివిధ మార్కెటింగ్‌ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని అందుకు అనుగుణంగా ఉత్పత్తులు అందించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. పసుపు ఆయిల్‌ విషయానికి వస్తే ఫార్మా కంపెనీలకు, ఫ్లోర్లు, టాయిలెట్లు శుభ్రం చేసే రెండురకాల ఉత్పత్తులు తయారు చేయనున్నారు. ఈ ఏడాది రూ.100 కోట్లు, వచ్చే ఐదేళ్లలో రూ.500 కోట్ల టర్నోవర్‌ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఈ ఎఫ్‌పీవో బాధ్యుడు పాట్కూరి తిరుపతిరెడ్డి తెలిపారు. వీరు ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శకులు అధికసంఖ్యలో దర్శించారు.



పసుపురైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌ స్టాల్‌

రైతు మహోత్సవంలో అగ్నిప్రమాదం



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని జీజీ కాలేజీ వద్ద నిర్వహిస్తున్న రైతు మహోత్సవంలో మంత్రులు వచ్చిన హెలీకాప్టర్‌ టెంట్ల వద్ద దిగడంతో వంట చేసే టెంట్‌కు మంటలు అంటుకున్నాయి. హెలీకాప్టర్‌ గాలికి టెంట్‌ మంటలపై కూలిపోవడంతో మంటలు అంటున్నాయి. వెంటనే అక్కడ ఉన్న ఫైర్‌ సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది.





రైతు మహోత్సవ ముఖద్వారం ముందు ల్యాండ్‌ అవుతున్న హెలికాప్టర్‌.. దుమ్ము లేవడంతో ఇబ్బందిపడుతున్న ప్రజలు



కూలిన రైతు మహోత్సవం ముఖ ద్వారం



టెర్రస్‌ గార్డెన్‌ నమూనా స్టాల్‌



వరి విత్తనాల చిన్నికృష్ణుడి స్టాల్‌



తేనె స్టాల్‌





స్టాల్‌ను ప్రారంభిస్తున్న నిజామాబాద్‌ కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, కామారెడ్డి కలెక్టర్‌ సంగ్వాన్‌

పదేళ్లు సదస్సులు మర్చిపోయారు



గత ప్రభుత్వం పదేళ్లలో రైతు సదస్సులు మర్చిపోయిందని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ రైతు సదస్సులు నిర్వహిస్తుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ అన్నారు. ఇరిగేషన్‌ అధికారులు ఊసరవెల్లిలా ప్రవర్తించడంపై ఆయన మండిపడ్డారు. ఆదర్శ రైతు పథకాన్ని పున: ప్రారంభించాలని వ్యవసాయశాఖ మంత్రిని కోరారు.

ఫసల్‌ బీమా అమలుచేయాలి



రాష్ట్రంలో అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు ఫసల్‌ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ అన్నారు. ఫసల్‌ బీమా యోజన ప్రీమియం డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలన్నారు. మండల కేంద్రాల్లో రైతు అవగాహన సదస్సులు నిర్వహించాలని, యంత్ర పరికరాలు అందించాలన్నారు.

అవినీతికి పాల్పడ్డారు



ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు 20, 21 ప్యాకేజీ పనులకు రూ.300 కోట్లు కేటాయిస్తే రైతులకు నీరందేదని, బీఆర్‌ఎస్‌ పైపుల ద్వారా సాగునీరు అందిస్తామని రూ.3వేల కోట్లు ఇచ్చి, అందులో రూ.2వేల కోట్లు అవినీతికి పాల్పడ్డారని బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. పసుపు అధిక కుర్కుమిన్‌ వచ్చే వంగడాల సాగుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, వాటిని ఇతర దేశాలకు ఎగుమతి చేయవచ్చని తెలిపారు. కొనుగోళ్లు సాఫీగా సాగుతున్నాయని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు.

ప్రాణహిత-చేవెళ్లకు నిధులు కేటాయించాలి..



ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్‌ 20, 21, 22 ప్యాకేజీ పనులను అధిక ప్రాధాన్యత ప్రాజెక్టుగా గుర్తించి వెంటనే నిధులు కేటాయించాలని, రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మంత్రి ఉత్తమ్‌ను కోరారు. వైఎస్‌ఆర్‌ హయాంలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించారని గుర్తుచేశారు. ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఎన్ని లక్షల మెట్రిక్‌ టన్నులైనా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత..



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరతతో రైతులు రోజుల తరబడి కల్లాల వద్దే ఉంటున్నారని ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని, అంచనా మేరకు కాంటాలు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా, బోనస్‌ త్వరగా రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు.

బోనస్‌ త్వరగా జమ చేయాలి



రాష్ట్రంలో రైతులను ఆదుకునేలా నిర్ణయాలు, పథకాలను ప్రభుత్వం అమలు చేయాలని ఎమ్మెల్సీ చిన్నమైల్‌ అంజిరెడ్డి అన్నారు. ధాన్యం బోనస్‌ డబ్బులు త్వరగా రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఫసల్‌ బీమాతో రైతులకు ప్రయోజనం చేకూరుతోందని, ఈపథకంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తిచేశారు.

అన్నదాతలు తరలి రావాలి



వ్యవసాయ ఆధారిత జిల్లాలో రైతు మహోత్సవం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషం కలిగించిందని, రైతులు భారీగా తరలివచ్చి సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ, పంట మార్పిడి, ఆధునిక సాగు పద్ధతులు, అధునాతన వంగడాలు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో అధిక లాభాల సాధనకు పాటించాల్సిన పద్ధతుల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో పాటు ఆదర్శ రైతులు అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు కూడా తమ అనుభవాలను పంచుకోవచ్చని, సలహాలు, సూచనలు అందించవచ్చన్నారు.

రైతు మహోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్‌: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిరాజ్‌ డిగ్రీ కళాశాల ఆవరణలో రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రైతు మహోత్సవంలో వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు సూచించారు. తొలిరోజైన సోమవారం పసుపు సాగులో మెళకువలు, ఆదర్శ రైతుల అనుభవాలు, చెరుకు సాగులో అవరోధాలను ఎలా అధిగమించాలి, ఆయిల్‌ పామ్‌ సాగుతో సమకూరే ప్రయోజనాలు, వరి పంటలో మేలు రకాలు, నిర్ణీత సమయంలో పంట విత్తుకోకపోతే కలిగే నష్టాలు, మొక్కజొన్న పంట సాగులో పాటించాల్సిన జాగ్రత్తలు, సుగంధ ద్రవ్యాల సాగు, వాటి ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్‌లో డిమాండ్‌ ఉన్న పంటలు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు అవగాహన కల్పించారన్నారు. ఆదర్శ రైతులు తమ అనుభవాలను వివరిస్తూ రైతుల్లో ఆసక్తిని పెంపొందింపజేశారని తెలిపారు.

నేటి కార్యక్రమాలు..

మంగళవారం పసుపు పంట సాగు పద్ధతులపై, మామిడి, ఇతర పండ్ల తోటల పెంపకంపై, ఆయిల్‌ పామ్‌, సోయాబీన్‌, పత్తి, మిర్చి, కూరగాయలు, సేంద్రియ పంటల సాగుపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, ఆయా అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. పశువుల మేత, డెయిరీ నిర్వహణ, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన గురించి వివరించనున్నారు. అలాగే ఆదర్శ రైతులు సుభాష్‌, ఆలేటి బాలకిషన్‌, ఎస్‌.గంగారాం, నాగ పోతరావు, వెలగపూడి గోపాల్‌ తమ అనుభవాలను వెల్లడించనున్నారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రైం కార్నర్‌

మామిడి తోట దగ్ధం



మోర్తాడ్‌(బాల్కొండ): భీమ్‌గల్‌ మండలం పల్లికొండలో మామిడి తోట దగ్ధమైంది. ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి ముదిరాజ్‌ సంఘానికి చెందిన 30 ఎకరాల్లోని మామిడి తోట పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదం వల్ల రూ.45లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ముదిరాజ్‌ సంఘం సభ్యుడు శ్రీనివాస్‌ తెలిపారు. తమకు జరిగిన నష్టంపై అధికారులు స్పందించి ప్రభుత్వం ద్వారా పరిహారం ఇప్పించాలని ఆయన కోరారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు



ధర్పల్లి: మండలంలోని కర్నల్‌ తండా వద్ద సోమవారం మధ్యాహ్నం ఆర్మూర్‌ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొలాల వైపు దూసుకెళ్లింది. బస్సు బంపర్‌ పొలం గట్టుపై ఉన్న చెట్టును ఢీకొనడంతో ఆగిపోయింది. దీంతో పెద్ద ప్రమాదమే తప్పిందని తండావాసులు పేర్కొన్నారు. బస్సులోని 20 మంది ప్రయాణికులు, కండక్టర్‌, డ్రైవర్‌ సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం బస్సును జేసీబీ సహాయంతో రోడ్డుపైకి తీసుకొచ్చారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

మోర్తాడ్‌(బాల్కొండ): మండలంలోని తిమ్మాపూర్‌లో అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్‌ తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కొమిరె సాయిలు(55) ఆదివారం రాత్రి మద్యం తాగి భార్య వెంకటమ్మ, కూతురు లతతో గొడవపడ్డాడు. అర్ధరాత్రి మూత్ర విసర్జన కోసం లేచిన సాయిలు గోడకు గుద్దుకోగా అతడి తలకు గాయమైంది. భార్య, కూతురు అతడిని గమనించి ఇంటిలోపలికి తీసుకువచ్చి పడుకోబెట్టారు. వేకువజామున చూసే సరికి సాయిలు మరణించి ఉన్నాడు. మృతుడి సోదరుడు నడ్పి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ..

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బంజ విశ్వనాథ్‌(55) అదే రోజు రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రోడ్డు ప్రమాదంలో కుమారుడు ఓంకార్‌, అతని స్నేహితుడు భానుప్రసాద్‌ మృతిచెందారు. ఓంకార్‌ తండ్రి విశ్వనాథ్‌ మృతిచెందడంతో ఇంట్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య

నిజాంసాగర్‌(జుక్కల్‌): నిజాంసాగర్‌ ప్రాజెక్టులో పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శివకుమార్‌ తెలిపారు. వివరాలు ఇలా.. బోధన్‌ పట్టణంలోని శక్కర్‌నగర్‌ ప్రాంతంలో అబ్దుల్‌ సలాం (37) నివసిస్తుండేవాడు. అతడి భార్య ఏడాది క్రితం మృతిచెందడంతో ఆమె తల్లితరపువారు సలాంపై కేసు వేశారు. దీంతో సలాం జైలుకు వెళ్లగా ఇటీవల బయటకు వచ్చాడు. తన పిల్లలను చూడడానికి అత్తగారింటికి వెళ్లిన సలాంను వారు అడ్డుకోవడంతో మనస్తాపం చెందాడు. దీంతో సలాం వాట్సప్‌ స్టేటస్‌ పెట్టి, నిజాంసాగర్‌ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వర్ని మండలంలో..

వర్ని: మండలంలోని చందూర్‌ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మహేష్‌ తెలిపిన వివరాలు ఇలా.. చందూర్‌ గ్రామానికి చెందిన అర్కల గోపాల్‌రెడ్డి ఆర్థిక ఇబ్బందులు భరించలేక సోమవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముప్కాల్‌ మండలంలో..



గంగాధర్‌ (ఫైల్‌)

బాల్కొండ: ముప్కాల్‌ మండలంలో ఓ వ్యక్తి ఇటీవల ఆత్మహత్యకు యత్నించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా.. నాగంపేట్‌ గ్రామానికి చెందిన ఏలేటి గంగాధర్‌ అలియాస్‌ వకీల్‌ (49) కొంతకాలంగా తనకు ఎవరో మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతో మానసికంగా బాధపడుతున్నాడు. మానసిక ప్రశాంతత కోసం ఈనెల 15న గ్రామస్తులతో కలిసి తిరుపతిలో శ్రీవారి సేవ చేయుటకు వెళ్లాడు. గంగాధర్‌ నిత్యం కల్లు తాగే అలవాటు ఉంది. తిరుపతిలో కల్లు లభించకపోవడంతో మానసిక ఆందోళనకు గురై ఆదివారం గ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో పురుగులమందు తాగాడు. అనంతరం కొత్తపల్లికి గ్రామంలో ఓ ఇంటి వద్ద నీరు తాగి అక్కడే కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆర్మూర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

తాడ్వాయి మండలంలో..

తాడ్వాయి (ఎల్లారెడ్డి): మండలంలోని కాళోజివాడిలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజయ్య తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మల్లమారి రాకేష్‌ (25)కు ఐదేళ్ల క్రితం రామారెడ్డి మండలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన సంధ్యతో వివాహం జరిగింది. వారికి మూడేళ్ల కుమారుడు అనూష్‌ ఉన్నాడు. రెండేళ్లుగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో ఇటీవల సంధ్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి రాకేష్‌ తీవ్ర మనస్థాపంతో బాధపడుతుండేవాడు. కాగా సోమవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమి వద్ద గల వేపచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

30 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడ్డ నిందితులు, గంజాయితో ఎక్సైజ్‌ డీసీ సోమిరెడ్డి, సిబ్బంది

ఖలీల్‌వాడి: ఎండుగంజాయి తరలిస్తున్న ఐదుగురిని పట్టుకుని అరెస్ట్‌ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ సోమిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరంలోని గంజ్‌ ప్రాంతంలో ఆటోనగర్‌కు చెందిన మొహమ్మద్‌ ఆయూబ్‌ వద్ద గంజాయి ఉన్నదనే సమాచారం మేరకు అతని వద్ద తనిఖీ చేయగా 250 గ్రాముల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొహమ్మద్‌ ఆయూబ్‌ను విచారించగా మహారాష్ట్ర, నాందేడ్‌లోని బోకార్‌కు చెందిన ఫరూక్‌ఖురేషీ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి నవీపేట్‌ మండలం యంచ వద్ద ఫారూఖ్‌ఖురేషీతోపాటు నాందేడ్‌లోని బోకార్‌కు చెందిన యషేక్‌ ఫయీమ్‌, షేక్‌ సిద్ధిక్‌, జుబేర్‌ పఠాన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి కారులో తనిఖీలు చేయగా అందులో 30కిలోల ఎండుగంజాయి దొరికినట్లు తెలిపారు. ఫారూక్‌ఖురేషీ ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్‌ సరిహద్దు ప్రాంతం నుంచి ఎండుగంజాయిని కొనుగోలు చేసి నిజామాబాద్‌, నాందేడ్‌ చుట్టుపక్కల ప్రాంతాలలో అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలిపారు. 30.250 కిలోల ఎండు గంజాయి విలువ రూ.6లక్షల వరకు ఉంటుదన్నారు. నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి కారు, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐ స్వప్న, ఎస్సై రాంకుమార్‌, సిబ్బంది హమీద్‌, రాజన్న, రాంబచన్‌, సుకన్య, ఆశన్న, అవినాష్‌, శ్యాంసుందర్‌, సాయికుమార్‌ పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది జైలు

ఖలీల్‌వాడి: నిర్లక్ష్యంగా డ్రైవింగ్‌ చేసి, ఒకరి మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌కు నిజామాబాద్‌ సెకండ్‌ అడిషినల్‌ జ్యుడీషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ శ్రీనివాస్‌ ఏడాది జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా.. 2018లో చిలుకల సాయిలు అనే వ్యక్తి తన బైక్‌పై నిజామాబాద్‌ నుంచి ముబారక్‌నగర్‌ వెళ్తుండగా వెనక నుంచి ఆర్టీసీ బస్సు వచ్చి అతడిని ఢీకొట్టింది. ఈఘటనలో సాయిలు మృతిచెందడంతో పోలీసులు ఆర్టీసీ డ్రైవర్‌ గణపతిపై కేసు నమోదు చేశారు. డ్రైవర్‌ నిర్లక్ష్యం కారణంగానే వ్యక్తి మృతిచెందినట్లు కోర్టులో రుజువు కావడంతో నిందితుడికి ఏడాది పాటు జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.